
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శనివారం 5 అక్టోబరు 2024



'టంగ్' వార్



మాటలు.. మంటలు..

- ప్రత్యర్థులే లక్ష్యంగా నోరుజారుతున్న నేతలు
- తొందరపాటుతో కొందరు.. కావాలనే మరికొందరు
- కొత్తచిక్కులు తెచ్చిపెడుతున్న విమర్శలు
- 'సినీ' దుమారం రేపిన మంత్రి కొండా సురేఖ ఆరోపణలు
- వర్గీకరణ, గుడి- బడిపై మాట జారిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- వివాదం కావటంతో అలా అనలేదంటూ సర్దిచెప్పుకొనే ప్రయత్నాలు
- రేవంత్ రుణమాఫీ చేయడని.. నాలుక కరుచుకున్న మానుకోట ఎంపీ
- మహబూబాబాద్ ఎమ్మెల్యే అసెంబ్లీ ప్రసంగంలో దొర్లిన బూతు పదం
- రాజీనామా చేసి గెలవాలంటూ సొంతపార్టీ ఎమ్మెల్సీ సారయ్యకి కొండా మురళి సవాల్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లీడర్లు టంగ్ స్లిప్ అవుతున్నారు. పొరపాటున మాట్లాడుతున్నారో.. మనసులో ఉన్నవే బయట పెడుతున్నారో తెలియదు కానీ రాజకీయంగా 'మంటలు' రేపుతున్నారు. ఫైర్ బ్రాండ్ నేతలుగా పేరున్న వారు సైతం నోరు జారి చిక్కుల్లో పడుతున్నారు. ఆలోచించడం మరిచి.. ఫ్రస్టేషన్‌లో మాటల తూటాలు పేలుస్తూ ఎదుటి వారిని నొప్పిస్తున్నారు. అంతేకాదు సోషల్ మీడియాలోనూ ట్రోల్ అవుతున్నారు. ఇటీవల వరుసగా ఓరుగల్లు నేతలు తమ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తున్నారు. బహిరంగ సమావేశాల మొదలు విలేకరుల సమావేశాల వరకు.. పార్టీ కార్యాలయాల నుంచి అసెంబ్లీ వరకు తమ 'అదుపులేని' మాటలతో పెద్ద పెద్ద వివాదాలకే తెరతీస్తున్నారు. ఈ లీడర్ల టంగ్ స్లిప్ కాస్తా టంగ్ వార్‌గా మారడం చర్చనీయాంశమైంది.

తీవ్ర దుమారం రేపిన 'కొండా'

వరంగల్‌కు చెందిన దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. కేటీఆర్‌పై రాజకీయ దాడి చేసే క్రమంలో సురేఖ సినిమా హీరో నాగర్జున కుటుంబంపై చేసిన వాఖ్యలు ఇటు రాజకీయ రంగాన్ని.. అటు సినీ ఇండస్ట్రీని కుదిపేశాయి. పోలీస్ కేసులు, పరువు నష్టం దాఖలు వరకు దారి తీశాయి. అయితే సురేఖ తన వాఖ్యలను వెనుక్కి తీసుకుంటు న్నట్టు ప్రకటించారు. కానీ అప్పటికే సినీ ప్రముఖులు సురేఖ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెట్టడంతో రచ్చ పెద్దదైంది. అంతకు ముందే తన మెడలో తన సోదర సమానుడైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నూలు దండ వేసిన ఫొటోను షేర్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు 'కల్యాణలక్ష్మీ ఎంత ఇచ్చారు' అని అనుచిత పోస్టులు పెట్టారని సురేఖ ఆరోపించారు. ఈ ఉదంతంపై ఆమె విలేకరుల సమావేశంలో కన్నీరు కూడా పెట్టుకున్నారు. దీని వెనుక కేటీఆర్ హస్తం ఉందని ఆరోపించిన సురేఖ.. అదే ఫ్రస్టేషన్‌లో కేటీఆర్‌పై మాటల దాడి చేస్తూ అక్కినేని కుటుంబంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత అనుకోకుండా మాట్లాడానని, ఆ కుటుంబం బాధపడిందని తెలుసుకుని తానూ బాధపడ్డానని వివరణ ఇచ్చారు. అయితే అప్పటికే సోషల్ మీడియాలో అక్కినేని అభిమానులు, బీఆర్ ఎస్ నేతలు మంత్రిని టార్గెట్ చేస్తూ ట్రోల్ చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం తెలుగురాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయ్యింది.

తూటల్లా పేలిన నాగరాజు మాటలు..

మాజీ పోలీస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఇటీవల మాట్లాడిన మాటలు ఇంకా తూటల్లా పేలుతున్నాయి. సెప్టెంబరు 30వ తేదీన ఐనవోలులో జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు చేసిన వాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. 'బడి కడితే మే ధావులు పెరిగిపోతారు... గుడి కడితే బిచ్చగాళ్ల పెరిగిపోతారు' అంటూ ఆయన చేసిన వాఖ్యలతో ఓ వర్గం ప్రజలు మండిపడుతున్నారు. నాగరాజు రాజీనామా చేయాలంటూ బీజేపీ కేడర్ ఆందోళనలకు దిగుతున్నారు. నాగరాజు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే దీనిపై వివరణ ఇచ్చిన నాగరాజు గుడులు కడితే బిచ్చగాళ్ల అవుతారనే పదాన్ని తాను కొందరు దొంగస్వాముల ఉద్దేశించి మాత్రమే అన్నానని తెలిపారు. తాను హిందువునని, శివుడి కంఠంలో ఉండే నాగరాజు పేరే తనకు పెట్టారని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అంతకుముందు కూడా ఓ సందర్భంలో నాగరాజు చేసిన వాఖ్యలు ఎస్సీ కులాల్లో గందరగోళానికి దారితీశాయి. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడారని ఎంఆర్‌పీ ఎస్ నేతలు వారం రోజులకు పైగా ఆందోళనలు చేశారు. ఇలా వరుస ఘటనలతో ఎమ్మెల్యే నాగరాజు వార్తల్లో వ్యక్తిగా నిలిచారు.

ఇలా మాట జారి.. అలా ట్రోల్ అయ్యారు

- మే 7న మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఫోను సంభాషణ లీక్ అయింది. తనకు తెలియకుండానే మేయర్‌ను పార్టీలో చేర్చుకున్నారని సురేఖ అనడం చర్చనీయాంశమైంది. మంత్రి నియోజకవర్గానికి చెందిన మేయర్‌ను మంత్రికే తెలియకుండా పార్టీలో చేర్చుకోడమేంటన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అసలు ఈఫోన్ సంభాషణను ఎవరు లీక్ చేశారనే దానిపై పార్టీలో అంతర్గత చర్చ కూడా జరిగింది.
- ఆగస్టు 13న మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ సొంత పార్టీ నేత, సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన ఓ కామెంట్ దుమారం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణ మాఫీ చేస్తానని చెప్పి, ఇంత వరకు చేయలేదని అనడంతో అక్కడున్న కాంగ్రెస్ నేతలు అవాక్కయ్యారు. అయితే నాడు రైతులకు రుణ మాఫీ చేస్తానని చెప్పి కేసీఆర్ మాట తప్పారని, రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేసి చూపిస్తున్నాడని చెప్పే క్రమంలో ఎంపీ మాట దొర్లారని కాంగ్రెస్ నేతలు తరువాత సర్దిచెప్పుకోవాల్సి వచ్చింది.
- ఆగస్టు 22వ తేదీన వరంగల్ పోచమ్మ మైదాన్‌లో రోడ్డుపై ఉన్న చిరువ్యాపారుల డబ్బాలు తొలిగించగా, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యపై ఆయన చేసిన వాఖ్యలు దుమారం రేపాయి. తాను పార్టీ మారినప్పుడు ఎమ్మెల్సీ పదవి కి రాజీనామా చేశానని, బీసీ నాయకుడనే చెప్పుకునే నాయకుడు కాంగ్రెస్‌లో చేరిన తరు వాత కూడా పదవికి రాజీనామా చేయటం లేదని, దమ్ముంటే రాజీనామా చేసి గెలిచి రావాలని సవాల్ విసిరారు. ఇలా సొంత పార్టీ నేతపై కొండా మురళీ చేసిన వాఖ్యలు పార్టీలో చర్చకు దారితీశాయి. ఇదే అవకాశంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా ట్రోల్ చేసింది.
- ఇక ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ జిల్లా అభివృద్ధిపై మాట్లాడిన మాటల్లో బూతులు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. అంతేకాదు ఈ మాటలతో ఎమ్మెల్యే సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురయ్యారు. 'సాముహిక కలెక్టరేట్లు, ప్రగతిభవన్లు, సెక్రెటరియట్లు కట్టించి మేము ఆ.. చూపిస్తున్నారు అధ్యక్షా' అంటూ అసభ్యకరంగా మాట్లాడారు. అనుకోకుండా వచ్చిన పదాలే అయినప్పటికి అసెంబ్లీ సాక్షిగా నోరు జారటంతో ఆయన విపరీతంగా ట్రోల్ అయ్యారు. వీరితో మరికొందరు ఎమ్మెల్యేలు, కీలక నేతలు కూడా పలు సందర్భాల్లో మాటలు తూలి వివాదాస్పదంగా మారారు.



అన్నపూర్ణేశ్వరిగా భద్రకాళి

రెండో రోజుకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 4: చరిత్రాత్మక భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రులు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఉదయం బ్రహ్మచారిణి క్రమంలో అన్నపూర్ణేశ్వరిగా అలంకరించారు. అనంతరం మకర వాహనంపై అమ్మవారిని ఊరేగించారు. సాయంత్రం దేవతా దుర్గా క్రమంలో పూజలు నిర్వహించి నవ దుర్గా క్రమంలో చంద్రప్రభ వాహనంపై అమ్మవారిని ఊరేగించారు. తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిజీకి ఆలయ ఈవో శేష భారతి, ప్రధానార్చకులు భద్రకాళి శేషు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి నిర్వహిస్తున్న హోమ యాగశాలను స్వామిజీ దర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌లు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం హరికథ, భక్తి సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, కూచన హరినాథ్, శ్యాంసుందర్, అర్చకులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



తొర్రూరులో ఎడ్ల బండిపై నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రులు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

మొనగాడు కాదు..
మోసగాడు

- రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్లేసి మాట తప్పాడు
- ఆరు గ్యారంటీలనూ సక్రమంగా అమలు చేయలేకపోయాడు
- సీఎం రేవంత్‌పై మాజీమంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్ ఫైర్
- తొర్రూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా
- ఎడ్లబండిపై నిరసన ర్యాలీ

7

నీటి సరఫరాలో అవాంతరాలు
లేకుండా చూడండి

- మేయర్ గుండు సుధారాణి



దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లో నీటిని పరీక్షిస్తున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 4: వరంగల్ నగర ప్రజలకు నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. శుక్రవారం దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి అధికారులతో మాట్లాడి నీటి సరఫరా తీరు, నీటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. నీటిలో రసాయనాలు మోతాదు మేరకు కలపాలన్నారు. ధర్మసాగర్ నుంచి వచ్చే రా వాటర్ వంద శాతం శుద్ధి చేసి ప్రజలకు అందించాలన్నారు. మేయర్ వెంట ఈఈ శ్రీనివాస్, డీఈలు రంగారావు, కృష్ణమూర్తి, రవీందర్‌లతో పాటు ఏఈలు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- ప్రతీ కుటుంబ వివరాలు సేకరించాలి: కలెక్టర్

వర్ధన్నపేట, అక్టోబరు 4 : తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, జిల్లాలో ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందించనున్నట్టు కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. శుక్రవారం వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని పదో డివిజన్‌లో కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలు సుకున్నారు. మునిసిపాలిటీలో చేపట్టిన సర్వేను పరిశీలిం చడం తోపాటు కుటుంబం నుంచి సేకరిస్తున్న వివరాలను స్వయంగా పరిశీలించారు. పైలెట్ ప్రాజెక్టు కింద దివి టిపల్లి, వర్ధన్నపేట మునిసిపాలిటీ పరిధిలోని పదో డివి జన్‌ను ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా కుటుంబంలో పేదగా ఉన్న మహిళను కుటుంబ పెద్దగా సూచించాలన్నారు. ప్రతీ కుటుంబానికి ఒక్క ఐడీ, కుటుంబంలో ఉన్న ప్రతి సభ్యుడికి ఒక్కో ఐడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాల సేకరణలో ఆధార్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఒక్క రాష్ట్రం ఒక్క కార్డు కింద రాష్ట్రంలో కుటుంబ కార్డుగా ఉంటుందన్నారు. ప్రజలు అధికారులకు వివరాలు అందించి సర్వేకు సహకరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ విద్యాసాగర్‌తో కలిసి వరిసాగు, ప్రస్తుతం ఏ పరిస్థితులో ఉంది ఎన్ని రోజులకు కోతకు వస్తుందో రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యసాగర్, మునిసిపల్ కమిషనర్ జోనా పాల్గొన్నారు.

మిల్లర్ల సమస్యలను పరిష్కరిస్తేనే సీఎంఆర్

- లేదంటే ఈ ఏడాది మిల్లింగ్ బంద్
- కలెక్టర్‌కు తేల్చిచెప్పిన మిల్లర్లు



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వరంగల్ రైస్ మిల్లర్లు

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 4: మిల్లర్ల సమస్యలను పరిగణలోకి తీసుకొని సీఎంఆర్‌కు సంబంధించి ప్రభుత్వం తగిన ఉత్తర్వులు జారీ చేస్తేనే మిల్లింగ్ చేస్తామని, లేని పక్షంలో ఈ సంవత్సరం మిల్లింగ్ చేయరాదని ఏకగ్రీవంగా తీర్మానించుకున్నట్టు వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం సంపత్‌కుమార్ నేతృత్వంలో రైస్ మిల్లరు వరంగల్ కలెక్టర్ సత్యశారదను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. సీఎంఆర్ విషయంలో అసోసియేషన్ నుంచి ఏ మిల్లులకు కూడా గ్యారెంటీ ఇవ్వలేమని కూడా స్పష్టం చేశారు. సన్నధాన్యం మిల్లింగ్ చేస్తే సీఎంఆర్ ఉత్తర్వుల ప్రకారం 67శాతం బియ్యం దిగుబడి రాదని స్పష్టం చేశారు. సన్న ధాన్యంతో బియ్యం దిగుబడి 55నుంచి 60శాతం మాత్రమే వస్తుందని వెల్లడించారు. గత 12సీజన్ల నుంచి మిల్లర్లకు రావాల్సిన మిల్లింగ్, డ్రేజ్, కస్టోడియన్ చార్జీలు వెంటనే చెల్లించాలని కోరారు. 2018-19 నుంచి 2-23-24సంవత్సరం వరకు బకాయి పడిన సివిల్ సప్లయ్ రవాణా చార్జీలను, 2022-23 నుంచి 2023-24 వరకు ఎఫ్‌సీఐ నుంచి రావాల్సిన ట్రాన్స్‌పోర్టు చార్జీలను ఇప్పించాలని కోరారు. మిల్లర్ల వద్ద ఉన్న పాత సంచులు వెంటనే తిరిగి తీసుకోవాలని, లేదా రూ.9 ధరతో బిల్లులో తగ్గించుకోవాలని కోరారు. గోదాముల్లో స్థలం లేక ఈ సంచులను మార్కెట్ ధర ప్రకారం రూ. 7నుంచి రూ.10 విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. 2023-24 సీఎంఆర్ మిల్లింగ్‌లో ఎదురైన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గత సీజన్‌లో నాన్ ఫ్యాక్ ధాన్యాన్ని అధికారులు బలవంతంగా మిల్లుల్లోదించడం వల్ల రైస్ మిల్లర్లు తీవ్రంగా నష్టపోయారని, కొన్ని మిల్లులు డిఫాల్ట్ కూడా అయ్యాయని తెలిపారు. 2023-24 ధాన్యం మిల్లింగ్ చేసేందుకు మార్చి నెలలో పర్మిషన్ వచ్చిందని, ఆ మధ్య కాలంలో మిల్లులన్నీ రెండు మూడు నెలల వరకు ఖాళీగానే ఉన్నాయని గుర్తు చేశారు. పర్మిషన్ ఇచ్చిన తర్వాత ఎఫ్‌సీఐలో స్థలాలు లేక ఎఫ్‌సీఐ బయట ప్రతీ లారీ 5 నుంచి 15 రోజుల వరకు వేచి ఉండి బియ్యం అన్‌లోడ్ చేయాల్సి వచ్చిందన్నారు. ఎఫ్‌సీఐలో స్థలం లేని కారణంగా బియ్యం డెలివరి ఆలస్యమై జూలై నుంచి ప్రతీ మిల్లరు సీఎంఆర్ ఖరీఫ్ బియ్యం ఎంటిటీ టెస్ట్‌లలో పాక్ కాక ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్ వారు తిరస్కరించారన్నారు. జూలై నుంచి దాదాపు వరంగల్ జిల్లాలోని మిల్లర్లు అందరు ప్రతి లారీ తిరస్కరణకు గురవుతూ ఉండడం వల్ల మిల్లులు మిల్లింగ్ ప్రక్రియ నిలిపివేశారని వివరించారు. సన్నధాన్యం, దొడ్డు ధాన్యం వేరువేరుగా లారీల్లో పంపాలని, కొత్త బస్తాలు, పాత బస్తాలను వేరు వేరుగా పంపాలని, డెలివరీ చేసిన వారం రోజుల లోపు మిల్లర్ల నుంచి బియ్యం తీసుకోవాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండారి దామోదర్, కోశాధికారి తక్కళ్లపల్లి యుగెందర్ ఉన్నారు. మిల్లర్లు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని కూడా కలిసి తమ సమస్యలను నివేదించారు. వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని అభ్యర్థించారు. ఈ మేరకు మాధవరెడ్డి కూడా రైస్ మిల్లర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతు సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసారు. రైస్ మిల్లర్ల డిమాండ్లను ఎమ్మెల్యే ఆ లేఖలో పేర్కొన్నారు. వారి సమస్యలను సానుభూతితో పరిశీలించాలని అభ్యర్థించారు.

చెప్పేవి నీతి సూత్రాలు.. చేసేవి అక్రమ వసూళ్లు!

- నగర పరిధిలో ఓ రిజిస్ట్రార్ చేతివాటం
- అందినంత దండుకుంటూ రిజిస్ట్రేషన్లు
- తోటి అధికారి సహకారంతో దందా

రాంనగర్, అక్టోబర్ 1: రిజిస్ట్రేషన్ శాఖలో అక్రమాలు అడ్డుకోవడం ఎవరితరం కావడం లేదు. నిబంధనల్లో ఉన్న లొసుగులను అవకాశంగా తీసుకుని అందినకాడికి దండుకోవడం సబ్ రిజిస్ట్రార్‌లకు పరిపాటిగా మారింది. జీరో సర్వీసుతో కిందిస్థాయి ఉద్యోగుల నుంచి జిల్లా రిజిస్ట్రార్ స్థాయి అధికారి వరకు బదిలీ చేసినప్పటికీ పనితీరులో మార్పు రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పారదర్శకంగా బదిలీలు చేశామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ వాటిలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు గుర్తించి ప్రక్షాళన ప్రారంభించింది. ఇలా ఎన్ని నూతన సంస్కరణలు చేసినా కొంతమంది సబ్ రిజిస్ట్రార్‌లు శాఖకు మచ్చ తెస్తూనే ఉన్నారు.

తాజాగా వరంగల్ నగర పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక సబ్ రిజిస్ట్రార్ చేతులు తడుపందే రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదనే ప్రచారం ఉంది. నిబంధనలు విస్మరించేది లేదంటూనే.. ఆస్తి విలువను బట్టి డబ్బులు దండుకుంటున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు నాన్ లేఅవుట్ ప్లాట్లు, అనుమతులు లేని ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు, పార్ట్ రిజిస్ట్రేషన్‌లు చేయకూడదు. ఈ నిబంధనలకు విరుద్ధంగా సదరు సబ్ రిజిస్ట్రార్ విలీన గ్రామాల్లోని ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు సమాచారం. ఇంటి నంబరుతో రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు తెలిసింది. ప్రతీ డాక్యుమెంట్‌కు ఆస్తి విలువను బట్టి రూ.20వేల నుంచి రూ.50వేల వరకు

మిగతా 8వ పేజీలో..



గడువులోపు పూర్తి చేయాలి

- డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 4: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికేట్ల పరిశీలన నేటితో ముగించాలని కలెక్టర్ సత్యశారద జిల్లా విద్యాశాఖ యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న వెరిఫికేషన్ కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం అభ్యర్థుల సర్టిఫికేట్ల వెరిఫికేషన్ శనివారంతో ముగియాలన్నారు. సర్టిఫికేట్ల వెరిఫికేషన్ సమగ్రంగా, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. డీఈవో జ్ఞానేశ్వర్‌తో కలిసి వెరిఫికేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి వెరిఫికేషన్ పరిశీలించారు.

అభ్యర్థుల ఆందోళన...

సర్టిఫికేట్ల వెరిఫికేషన్ ప్రక్రియ సజావుగా సాగడం లేదని అభ్యర్థులు ఆందోళనకు దిగారు. అవగాహన లేని సిబ్బందిని నియమించి సర్టిఫికేట్లను పరిశీలన చేయిస్తున్నారని వారు ఆరోపించారు. మార్కుల పర్సెంటేజిలు ఎలా తీసుకోవాలో కూడా కనీస పరిజ్ఞానం లేని వారిని నియమించి వారితో సర్టిఫికేట్లు పరిశీలన చేయించడం వల్ల అభ్యర్థులు నష్టపోయే ప్రమాదముందని వారు వాపోయారు. ముందస్తుగా ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే సర్టిఫికేట్ల పరిశీలన చేయించడం పట్ల వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకానొక దశలో అభ్యర్థులు కొంత సేపు పరిశీలన బృందంతో వాగ్వాదానికి దిగారు. తర్వాత సరిచేయడంతో సర్టిఫికేట్లు పరిశీలన కొనసాగింది.



వెరిఫికేషన్ కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద



వచ్చే నెల 4 నుంచి
ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 4: కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నవంబరు 4వ తేదీ నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య గురువారం తెలిపారు. నవంబరు 4న శుక్రవారం ప్రీ పీహెచ్‌డీ మొదటి పేపర్-1, అలాగే నవంబరు 8న ఎలక్టివ్ పేపర్-2లో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల కేంద్రాన్ని వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫార్మసీ, ఇంజనీరింగ్, లా, సైన్స్, ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, ఎడ్యుకేషన్ విభాగాల్లో అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

కాజీపేట మీదుగా దసరా ప్రత్యేక రైళ్లు

కాజీపేట, అక్టోబరు 4: కాజీపేట- దాదర్, దాదర్ - కాజీపేటల మధ్య దసరా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. 07195 కాజీపేట - దాదర్ అక్టోబరు 16, 23, నవంబర్ 13, 20, 27 తేదీల్లో కాజీపేట నుంచి ప్రతీ బుధవారం 15.00 గంటలకు బయలు దేరి గురువారం 13.25 నిమిషాలకు చేరుకుంటుంది. 07196 దాదర్ - కాజీపేట ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 17, 24, నవంబర్ 14, 21, 28, తేదీల్లో దాదర్‌లో ప్రతీ గురువారం 15.25 నిమిషాలకు బయలుదేరి శుక్రవారం 16 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. 07197 కాజీపేట-దాదర్ ఎక్స్‌ప్రెస్ కాజీపేటలో అక్టోబరు 12, 19, 26 నవంబర్ 2, 11, 16, 23, 30 ప్రతీ శనివారం 11.30నిమిషాలకు బయలుదేరి ఆదివారం 13.25కు చేరుకుంటుంది. (07198) దాదర్ - కాజీపేట ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 13, 20, 27 నవంబరు 3, 10, 24, 27 డిసెంబరు 1వ తేదీన దాదర్‌లో ప్రతీ ఆదివారం 15.25నిమిషాలకు బయలుదేరి సోమవా రం కాజీపేటకు 21.30 నిమి షాలకు చేరుకుంటుంది. ఈ రైలుకు జమ్మికుంట, పెద్దపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, బందర్, వాని, కయర్, లింగ్‌టీ, పింపల్కుహటి, ఆదిలాబాద్, కిన్‌వేట్, సమస్రఖండ్, హిమయత్‌నగర్, బోకర్, మెద్కేడ్, నాందేడ్, పూర్ణ, పర్బానీ, పెలు, పర్దున్, జల్నా, ఔరంగబాద్, లానూర్, రోటేగాం, నాగర్‌సోల్, మన్మాడ్, నాసిక్, ఇగ్‌టాపూరి, కళ్యాన్, రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ ఇచ్చారు.

కొనసాగుతున్న డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్


వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 4: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లు 1:3 మెరిట్ ప్రాతిపదికన వెరిఫికేషన్ కొనసాగుతోంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారంతో రెండోరోజుకు చేరుకుంది. హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వెరిఫికేషన్ ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు డీఈవో డి.వాసంతి తెలిపారు. కాగా, శనివారంతో వెరిఫికేషన్ ప్రక్రియ ముగియనుంది.

ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాల భర్తీ చేయడం అన్యాయం

న్యూశాయంపేట, అక్టోబర్4: ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయడం అన్యాయమని, ఇది మాదిగలకు ద్రోహం చేయడమేనని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ అన్నారు. శుక్రవారం న్యూశాయంపేటలో ఏర్పాటుచేసిన ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల సమావేశంలో నరేష్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేస్తామన్నారు. ఈ నిరసనకు ఎంఆర్‌పీఎస్ నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

మానుకోట కాంగ్రెస్ నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత

● వారం కిందట గుండెపోటు.. హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
నేడు పురుషోత్తమాయగూడెంలో అంత్యక్రియలు



మరిపెడ, అక్టోబరు 4: కాంగ్రెస్ సీనియర్ నేత, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన నూకల నరేశ్‌రెడ్డి(74) శుక్రవారం కన్నుమూశారు. వారం రోజుల కిందట ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో అభిమానులు శోకసముద్రంలో మునిగిపోయారు. వారం కిందట హైదరాబాద్ ఆస్పత్రిలో చేరిన ఆయనకు వైద్యులు స్టెంట్ వేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు, మాజీ మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆస్పత్రికి వెళ్లి నరేశ్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అయితే నరేశ్‌రెడ్డికి డాక్టర్లు మెరుగైన వైద్యం అందించినా ఫలితం లేకుండాపోయింది. శుక్రవారం సాయంత్రం ఆయన తుదిశ్వాస విడిచారు. నూకల నరేశ్‌రెడ్డి జీవితం ఓ తెరిచిన పుస్తకం. మేనమామ రామసహా యం సురేందర్‌రెడ్డి ద్వారా రాజకీయ వారసత్వం అందుకున్న ఆయన నాటి నుంచి నేటి వరకు కాలం తో పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో రాజకీయంగా అనేక పదవులు అందనట్టే అంది చేజారిపోయాయి. అయినా ఎన్నడూ నిరాశ చెందని ఆయనకు ఎలాంటి పరిస్థితుల్లో అయినా తనను నమ్మినోళ్లకు అండగా ఉన్నారన్న పేరుంది. నరేశ్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. శుక్రవారం రాత్రికి ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తీసుకురానుండగా.. శనివారం పురుషోత్తమయాగూడెంలోని వ్యవసాయ క్షేత్రంలో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంత్యక్రియలకు భారీగా జనం తరలొచ్చే అవకాశం ఉండటంతో మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ నేతృత్వంలో పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. నరేశ్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం రాత్రి పరిశీలించారు.

రాజకీయ ప్రస్థానమిలా..

1989 అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ కాంగ్రెస్ బీఫామ్ ఆయనకే ఖరారైనా కొందరి మోసపూరిత మాటలకు బలియై పోటీకి దూరమయ్యారు. 1994లో డోర్నకల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం జరిగిన పరిణామాలతో టీడీపీలో చేరిన ఆయన 1999ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి స్వల్ప ఓట్ల తేడాతో రెడ్యానాయక్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్పీ ఛైర్మన్ పదవిని ఆశించిన నరేశ్‌రెడ్డి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేయూతతో రాయపర్తి జడ్పీటీసీగా గెలిచారు. జడ్పీ ఛైర్మన్ కోసం గట్టిపోటీ ఇచ్చారు. 2012లో తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితులై అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాతి పరిణామాల్లో 2024లో మళ్లీ సొంతగూడైన కాంగ్రెస్‌లో చేరి.. ఎంపీ బలరాంనాయక్ గెలుపులో భాగస్వామ్యం అయ్యారు. అంతేకాదు ఆయనకు ఖమ్మం జిల్లాతోనూ ఎంతో రాజకీయ అనుబంధం ఉంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నరేశ్‌రెడ్డి టీఆర్ఎస్ తరపున ఆ జిల్లా ఇన్‌చార్జ్‌గా పని చేశారు. పాలేరు ఉపఎన్నికల్లో తుమ్మల గెలుపులో తనవంతు పాత్ర పోషించారు. 2018 ఎన్నికల్లోనూ మరోసారి ఇన్‌చార్జిగా పనిచేశారు. 2020ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపునకు కృషి చేశారు.

ఆటోడ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సుల అందజేత



ఆటోడ్రైవర్స్‌కు లైసెన్సును అందజేస్తున్న సీపీ

హనుమకొండ టౌన్, అక్టోబర్ 4: డ్రైవింగ్ లైసెన్స్ లేని 35 మంది డ్రైవర్లకు సీపీ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం డ్రైవింగ్ లైసెన్స్ అందజేశారు. కొద్ది రోజుల కిందట ట్రైసిటీ పరిధిలోని ఆటోడ్రైవర్స్‌కు ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆటోడ్రైవర్స్‌కు తాను చొరవ తీసుకొని లైసెన్స్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సీపీ ఆదేశాలతో రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంగా డ్రైవర్స్‌నుంచి కావాల్సిన దస్త్రాలను తీసుకొని లైసెన్స్‌లను మంజూరు చేశారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సమక్షంలో ఆయా డ్రైవర్స్‌కు సీపీ లైసెన్స్‌లను అందజేశారు. రానున్న రోజుల్లో హనుమకొండ, వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డ్రైవర్లకు సైతం లైసెన్స్‌లు ఇప్పిస్తామన్నారు. కాజీపేటలో లైసెన్స్‌లు ఇప్పించడానికి కృషిచేసిన సీఐ నాగబాబు, ఎస్సై ఉమాకాంత్‌లను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

బీజేపీ డ్రామాలకు రైతులు మోసపోవద్దు

- రుణమాఫీపై ధర్నాలు చేయడానికి ఆ పార్టీ నాయకులకు సిగ్గుండాలి
- మూసీ నది ప్రక్షాళనలో ప్రతిపక్షాల తీరు సిగ్గుచేటు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 4: రైతులకు ఏనాడూ రుణమాఫీ చేయని బీజేపీ వాళ్లు ఇప్పుడు రుణమాఫీ విషయంలో ధర్నాల పేరుతో డ్రామాలు చేస్తున్నారని, ఆ డ్రామాలను నమ్మి రైతులు మోసపోవద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, ఇప్పటికే 23లక్షల మందికి రుణమాఫీ వర్తింపజేశామని, దాదాపు రూ.18వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యా యన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న విధానాల ప్రకారం 42లక్షల మంది రైతులకు రుణమాఫీ వర్తింపజేయబోతున్నామని అందుకుగాను రూ.31వేల కోట్ల ఖర్చు చేయబోతున్నామని వివరించారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వస్తుందని, రైతులు ప్రతిపక్షాల మాటలు పట్టించుకోవద్దన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎక్కడా కూడ ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రుణమాఫీ చేసిన చరిత్ర లేదని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతుల రుణమాఫీ ఏనాడు చేయలేదని, కనీసం రుణమాఫీ చేస్తున్న రాష్ట్రాలకు ఆర్థిక చేయూత కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. రైతులకు ఏమీ చేయని బీజేపీ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటని, వారికి రైతులపై ప్రేమ ఉంటే కేంద్రాన్ని ఒప్పించి దేశ వ్యాప్తంగా రైతు రుణమాఫీ ప్రకటించాలన్నారు. రాష్ట్ర బీజేపీ నాయకులు నరేంద్రమోదీని ప్రశ్నించే ధైర్యం లేదని బీజేపీ అంటేనే రైతు, దళిత, తెలంగాణ వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. మూసీనది ప్రక్షాళన విషయమై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నాయని, మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న పేదలు సుమారు 1000 మంది స్వచ్ఛందంగా వెళ్లిపోగా వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, దీనిపై సీఎం ఓ స్పష్టమై విధానంతో ఉన్నారన్నారు. కానీ స్వచ్ఛందంగా వెళ్లిపోయే వారిని వెళ్లిపోకుండా మీరు ఈ మురికిలోనే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అన్నారు. పేదల ఓట్లతోనే గెలిచిన పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. పేదలను ఇబ్బందులు పెట్టే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేయదన్నారు. కార్యక్రమంలో నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, శిరీష్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మంచాల ఎల్లయ్య, నూకల ఐలయ్య, గడ్డమీది సురేష్, అన్నం బ్రహ్మారెడ్డి, డాక్టర్ అంబటి కిషన్‌రాజ్, తెల్లాకుల రామకృష్ణ, చాడ రాజ్‌కుమార్, గన్ను నర్సింహులు, రజాక్‌యాదవ్, కోతి రాములు, ఇనుగాల రాజిరెడ్డి, ఎడ్ల వెంకటస్వామి, బత్తిని అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మొనగాడు కాదు.. మోసగాడు..

రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్లేసి మాట తప్పాడు

సీఎం రేవంత్‌పై మాజీమంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్ ఫైర్

తొర్రూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా




తొర్రూరు సభా వేదికలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి దయాకర్ రావు

తొర్రూరు, అక్టోబరు 4 : సీఎం రేవంత్‌రెడ్డి మొనగాడు కాదు.. మోసగాడని, అధికారంలోకి రాగానే పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తానంటూ తొలి సంతకం చేసి రైతులను మోసగించాడని బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్ మండిపడ్డారు. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రులు, నేతలు ఎడ్లబండిపై నిరసన ర్యాలీ నిర్వహించి.. అనంతరం విశ్రాంతి భవనం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. తొలుత హరీశ్‌రావు మాట్లాడారు. అన్నదాతలకు కల్లబొల్లి మాటలు చెప్పి వారిని మోసం చేశారని, రుణమాఫీ చేసేవరకు కాంగ్రెస్ సర్కారును వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. పాలకుర్తి నియోజకవర్గంలో 30 శాతం కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ వరంగల్‌లో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు రుణమాఫీ, రైతు భరో సా, రైతుబంధు, పంటలకు బోనస్, అర్హులైన మహిళలకు రూ.2500 భృతి, పెన్షన్‌లు పెంపు లాంటి హామీలను అమలుపర్చకుండా మోసం చేస్తున్నారని, ప్రజలు బుద్ధి చెపుతారన్నారు. ఆగస్టు 15 వరకు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మొదట రూ.49 వేల కోట్లు, ఆ తర్వాత రూ.31 వేల కోట్లు చివరకు మాఫీ చేసింది రూ.17వేల కోట్లు మాత్రమే అన్నారు. తొర్రూరు మండలంలో 11 వేల మంది రైతులు రుణాలు తీసుకుంటే 5 వేల మందికి మాఫీ అయిందని, మిగతా రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని యాదాద్రి, భద్రాద్రి, కొమురెల్లి, సమ్మక్క-సారలమ్మలపై సీఎం రేవంత్‌రెడ్డి ఒట్టు వేసి, మాఫీ చేస్తానని మోసం చేశాడని అన్నారు. రేవంత్‌రెడ్డి తన శిష్యుడే కానీ, బ్రోకర్ మాటలు చెపుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి రైతులను మోసగిస్తున్న ఏ ప్రభుత్వం అధికారంలో కొనసాగలేదని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కూల్చుడు తప్ప కట్టుడు తెలువదన్నారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో కష్టపడి సంపాదించుకున్న ఇండ్లను కూలగొడుతున్నారని, మూసీ శుద్ధిపేరుతో మరో కుంభకోణానికి తెర లేపారన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

గోడు వెళ్లబోసుకున్న రైతులు

తొర్రూరులో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రైతు ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మాజీ మంత్రుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. వారిని మాజీమంత్రి సత్యవతి రాథోడ్ రుణం ఎంత ఉంది. భూమి ఎన్నిఎకరాలు ఉంది రుణమాఫీ కాకపోవడానికి అధికారులు ఏం చెపుతున్నారు లాంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ కాకుండా రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడని, రైతుల గోడు పట్టించుకోవాలన్నారు. దసరా వరకు రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి సచివాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. పంట కోతకు వచ్చిందని, రైతుబంధు, రైతు భరోసా పడలేదని కేసీఆర్ ఉన్నపుడు రైతుబంధు వచ్చేదని రైతులు తమ గోడును వారికి వెల్లగక్కారు. ఏది ఏమైనా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తూ ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేపట్టాలని, అప్పటి వరకు సీఎం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నిరసనకు హాజరైన రైతులు, కార్యకర్తలు

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల ఇద్దరి అరెస్ట్, చోరీ సొత్తు వివరాలు చెబుతున్న రైల్వే సీఐలు

గిర్మాజీపేట, అక్టోబరు 4: సింహపూరి ఎక్స్ ప్రెస్‌లో చోరీకి పాల్పడిన గొడుగు నవీన్ (21), గుగులోతు నరేష్(25)లను శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.3.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీ నం చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. వరంగల్ జీఆర్‌పీలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ మాట్లాడారు. గతనెల 13న గూడూరు నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న సింహపూరి ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ కోచ్‌లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికురాలు నిద్రలో ఉండగా బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్‌పీలో ఫిర్యాదు చేసింది. దీంతో గత నెల 26న వరంగల్ జీఆర్‌పీ బదిలీ అయిందన్నారు. ఇదిలా ఉండగా విధి నిర్వహణలో భాగంగా జీఆర్‌పీ సిబ్బంది శుక్రవా రం వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల తనిఖీ చేపట్టామన్నారు. ప్లాట్‌ఫాం2, ప్లాట్‌ఫాం3 ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను తనిఖీచేయగా వారి వద్ద బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో గొడుగు నవీన్ (గార్ల- మహబూబాబాద్ జిల్లా), గుగులోతు నరేష్ (రాజుల పాలెం -ఖమ్మం జిల్లా) నెల 13న సికింద్రాబాద్ వెళ్తున్న సింహపూరిలో ప్రయాణికురాలికి చెందిన బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు వారు అంగీకరించారని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుల నుంచి రూ.3.50లక్షల విలువైన బంగారు నెక్లెస్, రెండు బంగారు గాజులు, ఒక వెండి గ్లాస్, రెండు వెండి కుంకుమ భరిణెలు స్వాధీనం చేసుకుని కాజీపేట రైల్వేకోర్టు ద్వారా రిమాండ్ చేసినట్లు సీఐ తెలి పారు. సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ టి.ఎస్.ఆర్. కృష్ణ, జీఆర్‌పీ ఎస్సై మోహినుద్దిన్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితుడి ఆత్మహత్య

గిర్మాజీపేట, అక్టోబరు 4 : తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన హెచ్ఐవీతో బాధపడుతూ సోషల్ వర్కర్‌గా పనిచేస్తున్న యువకుడు(27) జీవితంపై విరక్తిచెంది గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. దుగ్గొండి మండలానికి చెందిన యువకుడికి తల్లిదండ్రుల నుంచి హెచ్ఐవీ సంక్రమించిందని, తల్లిదండ్రులు మృతి చెందడంతో వరంగల్‌లో సోషల్ వర్కర్‌గా పనిచేస్తు జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవీతో బాధపడుతున్న అతడు జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని మొదటి ప్లాట్‌ఫాంపై క్రిమిసంహారక మందు తాగి, విషయాన్ని ఫోన్ ద్వారా స్నేహితులు, బంధువులకు చెప్పగా వారు 108 కాల్ చేశారన్నారు. వారు అపస్మారక స్థితిలో ఉన్న అతడిని ఎంజీఎంకు తరలించగా, పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందినట్టు పేర్కొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఎమ్మెల్సీ సారయ్యతో ఉత్సవ సమితి సభ్యులు

ఎమ్మెల్సీని కలిసిన ఉత్సవ సమితి సభ్యులు

కాశిబుగ్గ, అక్టోబరు 4: కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి సభ్యులు శుక్రవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను కలిశారు. సద్దుల బతుకమ్మ, రావణాసురవధ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయించాలని సారయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వపరంగా అన్ని ఏర్పాట్లు చేయిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్, కన్వీనర్ బయ్యస్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, గుల్లపెల్లి రాజ్‌కుమార్, మనోహర్, రాజు, ఆంజనేయులు, శ్రీనివాస్, థామస్, ప్రకాష్, రఘునారెడ్డి, సత్యనారాయణ, పరమేష్, బాబు, యాదగిరి, సురేష్, బాలరాజు, చంద్రశేఖర్ ఎమ్మెల్సీ సారయ్యను కలిసిన వారిలో పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థినులు

గిర్మాజీపేట, అక్టోబరు4: నగరంలోని శ్రీవిశ్వేశ్వరయ్య సంస్కృతాంధ్ర (ఎయిడెడ్) డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు జరిగాయి. కళాశాల పాలకవర్గం సభ్యురాలు ఆకారపు స్వాతి, అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి బతుకమ్మను పేర్చి కళాశాల ఆవణలో పెట్టి బతుకమ్మ ఆడారు. స్వాతి మాట్లాడుతూ స్నేహం, బంధుత్వం, అప్యాయతలు, అనురాగం, కష్టసుఖాలు కలగలిపిన, ప్రకృతిని ఆరాధించే పండుగే బతుకమ్మ పండుగని అన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అధ్యాపకులు సుస్మిత, జయకృష్ణ, లింగమూర్తి, దేవరాజు, కుమార్ పాల్గొన్నారు.

- వరంగల్ కల్చరల్: తెలంగాణ సంస్కృతి పండుగైన బతుకమ్మ వేడుకలు మూడో రోజు శుక్రవారం రామన్నపేట మోక్షారామం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమ్మ ఒడిలో జరిగాయి. స్థానిక మహిళలు, చిన్నారులు ప్రతీ రోజు బతుకమ్మ ఆట పాటలతో చిందులేస్తూ వేడుకల్లో పాల్గొంటున్నారు.
- శంభునిపేట: ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి బతుకమ్మ పండుగ అని లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ వారియర్స్ అధ్యక్షుడు శేర్ల అనిల్ కుమార్ అన్నారు. రంగశాయిపేట లిటిల్ ఫ్లవర్ హై స్కూల్‌లో శుక్రవారం బతుకమ్మ సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆకారపు రాజగోపాల్, సత్యనారాయణ, కరస్పాండెంట్ శేర్ల రజిని, ఉపాధ్యాయులు పూర్ణిమ, సాలేహా, కృష్ణవేణి, తులసి, మానస, ఫర్హాత్, తస్లీమా, రజిత, కల్పన, ప్రవీణ్ పాల్గొన్నారు.

'మంత్రిని విమర్శించే స్థాయి నరేందర్‌కు లేదు'



గిర్మాజీపేట, అక్టోబరు 4 : ప్రజా సేవకురాలుగా ప్రజల మన్ననలు పొందుతున్న మంత్రి కొండా సురేఖను విమర్శించే స్థాయి, అర్హత మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌కు లేదని తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి మీసాల ప్రకాష్ అన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ప్రజల చీత్కారానికి గురైన నరేందర్ మంత్రిపై విమర్శలు చేయడం ప్రజలు హర్షించరన్నారు. శుక్రవారం నగరంలోని దయానంద్ కాలనీలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ప్రకాష్ మాట్లాడుతూ సురేఖ గ్రామస్థాయి నుంచి రాష్ట్ర మంత్రిగా ప్రజల మన్ననలతో అంచెలంచెలుగా ఎదిగి ప్రజా సేవ చేస్తుంటే తట్టుకోలేని బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జంగం ప్రభాకర్, అన్వేష్, సదానందం, వేణు, నాగరాజ్, రవి, భిక్షపతి, కుమారస్వామి, జ్యోతిబస్, శారద, లావణ్య పాల్గొన్నారు.

ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



రంగశాయిపేట గాంధీ విగ్రహం వద్ద అమ్మవారి పూజ



టీ షర్టులు అందజేస్తున్న మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ జన్ను రాజయ్య

వరంగల్ కల్చరల్, అక్టోబరు 4: దేవి నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా శృంగేరి శంకర మఠంలో ఉత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. శ్రీ శారద మాతకు పలు నది జలాలతో పంచసూక్తాలతో విశేష అభిషేకాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య శారదామాతను దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శంకర సేవా సమితి సభ్యులు కుమారస్వామి, భాస్కర్, దేవేందర్, రాజేంద్రప్రసాద్, విజయ్, సర్వేశ్వర్, రవీందర్, వెంకటేశ్వర్‌రావు, రాజు, మహిపాల్, సందీప్, సంధ్యారాణి, కల్యాణి పాల్గొన్నారు.

- శంభునిపేట: శరన్నవాత్రి ఉత్సవాలలో భాగంగా రెండో రోజు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రంగశాయిపేటలోని గాంధీ విగ్రహం వద్ద వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయం, హనుమాన్, భవానీ శంకరాలయం, కురుమ జెండా వద్ద యువకుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారు అన్నపూర్ణగా దర్శనమిచ్చారు.
- పోచమ్మమైదాన్: పైడిపెల్లిలో దేవి నవరాత్రులు నిర్వహిస్తున్న భద్రకాళి యూత్ ఉత్సవ కమిటీ సభ్యులకు శుక్రవారం మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ జన్ను రాజయ్య టీ షర్టులు పంపిణీ చేశారు. సుమారు 70మంది ఉత్సవ కమిటీ సభ్యులకు టీ షర్టులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జన్ను సుధాకర్, గట్టు బాలరాజు, ఇటికాల సాంబయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు జన్ను శంకర్, ఉప్పుల రవి, జన్ను రాజ్‌కుమార్, కన్నెబోయిన నాగరాజు యాదవ్, వడ్డెమానుకోట శంకర్, బైరోని వరుణ్, ఉప్పుల రాజు, కొత్తకొండ కిట్టు, మదూరి సురేష్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి



వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 4: నర్సంపేటలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న స్వీపర్, అటెండర్, టెక్నీషియన్, ఏఎన్ఎం, జీఎన్ఎం, సూపర్ వైజర్ తదితర పోస్టుల్లో అర్హులైన దళిత కుటుంబాలకు అవకాశం కల్పించాలని కోరారు. కొంత మంది దళారులు ఏజెన్సీ ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేశారని, ఉద్యోగం వస్తుందనే ఆశతో కొందరు అమాయకులు మోసపోయారని తెలిపారు. స్థానికులకే అవకాశం కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పూలక్క, పీడీఎస్‌యూ అధ్యక్షుడు అజయ్, హరిబాబు, రంజిత్, వీరన్న, సుకన్య, ప్రభావతి, రవళి, అఖిల, ప్రతిభ పాల్గొన్నారు.



శిక్షణ పొందిన ఉపాధ్యాయులు

ముగిసిన సీబీఎస్ఈ

ఉపాధ్యాయులకు శిక్షణ

శంభునిపేట, అక్టోబరు 4: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ)ఆధ్వర్యంలో రంగశాయిపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ తరుగతులు శుక్రవారం ముగిశాయి. నూతన విద్యావిధానంలోని మెళకువలు- పరీక్షలు విధివిధానాలు అనే అంశాలపై రెండు రోజులుగా ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణ శిబిరానికి కేంద్రియ విద్యాలయం రిటైర్డ్ డిప్యూటీ కమీషనర్ పీవీ సాయిరంగారావు, నల్గొండ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్థసారథి గోవర్ధనం, రీసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.సరితారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగతులు ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్యాభివృద్ధికి దోహదం చేస్తాయని అన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

హనుమకొండ టౌన్, అక్టోబరు 4: ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న నిషేధిత గుట్కాలను కమిషనరేట్ పరిధిలోని వివిధ జోన్‌లలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకొని రూ.6.50లక్షల విలువ చేసే గుట్కాలను సీజ్ చేశారు. మట్టెవాడ పీఎస్ పరిధిలో రూ.1,39,400 విలువ చేసే గుట్కాలు, హనుమకొండ పీఎస్ పరిధిలో రూ.2,55,000 విలువ చేసే గుట్కా, పరకాల పీఎస్ పరిధిలో రూ.2,35,450 విలువ చేసే గుట్కాలు పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. అలాగే పరకాలలో ఎర్రం రవీందర్ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు రూ.12లక్షల విలువ చేసే దీపావళి టపాసులను సీజ్ చేసినట్లు తెలిపారు.

చెప్పేవి నీతి సూత్రాలు.. చేసేవి అక్రమ వసూళ్లు!

5వ పేజీ తరువాయి

వసూలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారంసాగుతోంది. సదరు ఇళ్లు నిషేధిత స్థలంలో ఉందా? నిర్మాణ అనుమతులు ఉన్నాయా? లేవా? అని చూడకుండా చేతులు తడుపగానే గుడ్డిగా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు సమాచారం. కాగా, విలీన గ్రామాల్లో చాలా ఇండ్లు నిషేధిత స్థలాల్లో ఉన్నప్పటికీ పంచాయతీ నుంచి నంబరు పొందారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిషేధిత స్థలాల్లో ఉన్న ఇండ్లను కూల్చుతున్న విషయం తెలిసిందే. డబ్బులు తీసుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ అనుమతులు లేని ఇండ్లు, పార్ట్ రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు సమాచారం. నిబంధనలు విస్మరించేది లేదంటూనే శాఖ ఆదాయం తగ్గిస్తున్న సబ్ రిజిస్ట్రార్.. తన ఖజానా మాత్రం నింపుకుంటున్నట్లు సమాచారం. కాగా ఈయన దండుకుంటున్న మొత్తం నుంచి అదే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తొటి అధికారికి వాటా ఇస్తున్నట్లు తెలిసింది. సోమవారం బాధ్యతలు చేపట్టిన జిల్లా రిజిస్ట్రార్ ఈ దందాపై ఏ మేరకు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



విజేతలకు బహుమతులు అందిస్తున్న కమాండెంట్ రాంప్రకాశ్

శంభునిపేట, అక్టోబరు 4: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ బి.రాంప్రకాశ్ అన్నారు. మామునూరు క్యాంపులో నిర్వహిస్తున్న ఎస్‌సీటీపీసీల క్రీడల ముగింపు వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి కమాండెంట్ రాంప్రకాశ్‌తో పాటు పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజలు అతిథులుగా పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి మెడల్స్, బహుమతులు అందించారు. వారు మాట్లాడుతూ.. విది నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే ఉద్యోగులకు క్రీడలు మానసిక ప్రశాంతతను అందిస్తాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్‌ఐలు శోభన్, రవి, సర్వర్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రాజారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారులు

బల్దియా సీఎంహెచ్‌వోగా రాజారెడ్డి బాధ్యతలు

వరంగల్ కార్పొరేషన్, అక్టోబరు 4: బల్దియా ప్రజారోగ్యం విభాగంలో మార్పులు జరిగాయి. సీఎంహెచ్‌వో (చీఫ్ మెడికల్ ఆఫీసర్)గా డాక్టర్ రాజారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బల్దియా పరిధి66డివిజన్‌లుగా విస్తరించడంతో ఇద్దరు మెడికల్ అధికారులను ప్రభుత్వం నియమించినట్టు ఉన్నతాధికారులు వెల్లడించారు. దీంతో ప్రస్తుతం సీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డాక్టర్ మల్లం రాజేశ్ వైద్యవిధ్యలో జూనియర్ కావడంతో ఎం హెచ్‌వోగా కొనసాగిస్తూ రాజారెడ్డిని సీఎంహెచ్‌వోగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే రాజారెడ్డి గతంలో ఐదేళ్లపాటు వరంగల్‌లో ఎంహెచ్‌వోగా పని చేశారు. తర్వాత జరిగిన సాధారణ బదిలీలలో రెండేళ్లపాటు హైదరాబాద్‌లో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేశారు. ప్రస్తుతం వరంగల్ బల్దియాకు సీఎంహెచ్‌వోగా బదిలీపై వచ్చారు. అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి వద్ద రాజారెడ్డి రిపోర్టు చేసిన తర్వాత బల్దియా ఉన్నతాధికారులను కలిసి పూల మొక్కలను అందించి కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత తన చాంబర్‌లో వివిధ సంఘాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంహెచ్‌వోను కలిసిన వారిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోలెపాక అనిల్‌కుమార్, బల్దియా డ్రైవర్స్ యూనియర్ నాయకులు పడాల రామ్మూర్తి, మారెడుకొండ రాజు, ఆడెపు సత్యనారాయణ, సాంబరాజు శ్రీనివాస్, మాదాసి అశోక్, దడిగల రవీందర్, మాదాసి భిక్షపతి, అర్షంస్వామి పాల్గొన్నారు.



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గన్నీ బ్యాగుల్లో తెచ్చిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలి

వరంగల్ సిటీ, అక్టోబరు 4: మరి కొద్ది రోజుల్లో మార్కెట్లో పత్తి సీజన్ ప్రారంభం అవుతుంది. మార్కెట్‌కు రైతులు గన్నీ బ్యాగుల్లో తెచ్చిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయాలని, అలాగే వ్యాపారులు గన్నీ బ్యాగుల ధర పెంచి రైతుకు ఇచ్చేల చర్యలు తీసుకోవాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రమేష్ డిమాండ్ చేశారు. అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) ప్రతినిధుల బృందం శుక్రవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మలను కలిసి మార్కెట్లో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాబూరావు, ఇస్మాయిల్, ప్రతాప్, జగదీశ్వర్, నగేష్ పాల్గొన్నారు.

కాలనీ కమిటీ ఎన్నిక

కాశిబుగ్గ, అక్టోబరు 4: శ్రీవేంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎరుకల రఘునారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సతీష్, ప్రధాన కార్యదర్శిగా జనార్దన్, కోశాధికారిగా రాజవర్ధన్, సభ్యులుగా కేశవ్, పూర్ణచారి, రఘు, అరవింద్, శ్రీనివాస్, శివ, నిఖిల్, గౌరవ అధ్యక్షుడిగా నరేందర్, గౌరవ సలహాదారుడిగా కుమారస్వామి ఎన్నికయ్యారు.



దసరా.. దడ!

అధికారికంగా పండుగ

నిండుకున్న అధికారుల జేబులు

కార్యదర్శులకు పండుగ సంబరం కరువు

ప్రత్యేక నిధులు విడుదల చేయాలని విన్నపాలు

పట్టించుకోని ప్రభుత్వం.. ఉన్నతాధికారులు

రాయపర్తి, అక్టోబరు 4 : ఈ ఏడాది దసరా పండుగ అధికారులకు దడ పుట్టిస్తోంది. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన ఉండడంతో పండుగ ఏర్పాట్లు చేసేందుకు నానాతంటాలు పడుతున్నారు. ఎంగిలి పూల బతుకమ్మ పండుగ రోజే మైనర్ గ్రామ పంచాయతీల్లోనే దాదాపు రూ.30వేల వరకు గ్రామ పంచాయతీ కార్యదర్శుల జేబుల్లో నుంచి పెట్టుకోవాల్సి వచ్చింది. దసరా పండుగను ఆలోచిస్తే వారి గుండెల్లో దడపుడుతోంది. తెలంగాణ రాష్ట్ర అధికారిక పండుగగా బతుకమ్మ పండుగను చేస్తున్నప్పటికీ, ఆ మేరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారుల జేబుల్లోనుంచి డబ్బులు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే గ్రామ పంచాయతీల ఖజనాలు నిండుకోవడంతో, ప్రస్తుతం అధికారుల జేబులు కూడా నిండుకున్నాయని తమ గోడును పై అధికారుల వద్ద వెల్లబోసుకుంటున్నారు.

జీపీలకు భారంగా పండుగ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి రావాల్సిన నిధులు కొన్ని నెలలుగా రాకపోవడంతో ఇప్పటికే గ్రామ పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు భారంగా మారింది. తొమ్మిది నెలలుగా నడుస్తున్న ప్రత్యేక పాలనతో ఇటు పంచాయతీల ప్రత్యేక అధికారులు, ఇటు కార్యదర్శుల సమన్వయంతోనే సొంత డబ్బులువెచ్చిస్తూ జీపీని వెల్లదీస్తున్నారు. కొన్ని నెలల నుంచి సెక్రటరీలు దాదాపు రూ.2లక్షల వరకు అప్పులు చేసి పంచాయతీలను నెట్టుకొస్తున్నారు.

తలలు పట్టుకుంటున్న సెక్రటరీలు

ప్రజా ప్రతినిధుల పాలనలో పంచాయతీలు ఉంటే ఏ సమస్య అధికారులకు ఉండేది కాదు. కానీ ఇప్పుడు వారు లేకపోవడంతో అధికారులకు ఖర్చు తప్పకపోవడంతో పాటు చిన్న సమస్య వచ్చిన చివాట్లు కూడా తప్పేలాలేవు. దీంతో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. ఓ పక్క నిధులు లేక ఇబ్బందులు, మరో పక్క గ్రామస్థాయిలో అధికారి, ప్రతిపక్ష పార్టీ నాయకుల బెదిరింపులు ఉంటాయని ఇప్పటినుంచే భయాందోళనకు గురవుతున్నారు.

నిర్వహణ భారం

సర్పంచుల పదవీ కాలం ముగిసిపోవడంతో ఏడు నెలల నుంచి గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యతలు పూర్తిగా కార్యదర్శుల పైనే పడింది. గ్రామంలో ఏ పని చేయాలన్న డబ్బులు లేకపోతే అంతే పరిస్థితి. వస్తున్న పన్నులు కార్యాలయ నిర్వహణ, సిబ్బంది జీతాల కే చాలడంలేదు.

దీంతో కొన్ని నెలలుగా సిబ్బంది జీతాలు సైతంలేక విలవిల లాడుతున్నారు. నీటి సరఫరా మొదలకుని, పారిశుధ్యం వీధి దీపాలు, చెత్త వాహనాల నిర్వహణ, ట్రాక్టర్ల ఈఎంఐలు ఇలా ఎన్నో ఇబ్బందులు పడుతూ పంచాయతీ పాలనను ముందు కు తీసుకెళ్తున్నారు. బోరు మోటార్లు బాగు చేయిం చడం, కల్వర్టులను శుభ్రం చేయించడం, పైపు లైన్ లీకేజీలు అరికట్టడం, చేతి పంపులు పాడైతే సరి చేయ డం, నీటి ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్, గ్రామంలో తరచు ఏర్పడే సమస్యలని కార్యదర్శులే సొంత డబ్బులు పెట్టుకుని చేసుకోవాల్సి వస్తోంది.

ఖర్చులు ఇలా..

వరంగల్ జిల్లాలో మొత్తం 13 మండలాలు ఉండగా, ఆయా మండలాల్లో 325 వరకు గ్రామాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లోని కార్యదర్శులే పండుగ ఖర్చులను భరించుకోవాల్సి వస్తుంది. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ పండుగ సందర్భంగా ఆయా ప్రధాన ఆలయాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం, ఆలయం చుట్టూ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. మరుసటి రోజు వేసిన బతుకమ్మ పూలను ఎత్తిపోశారు. ఇక సద్దుల బతుకమ్మ పండుగ రోజున సైతం స్థానిక మైదానాల్లో, చెరువులు, కుంటల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలి. దారి పొడవున చీకటి లేకుండా విద్యుత్ స్తంభాలు లేకపోతే తాత్కాలికంగా కర్రలను నాటి లైట్లు బిగించాలి. మళ్లీ డీజేను ఏర్పాటు చేయాలి. డీజే ఖర్చు దాదాపు రూ.10 వేల వరకు ఉంటుంది. విజయదశమి పండుగ సందర్భంగా జమ్మి కొమ్మకు పూజ చేయడం తంతు ఉంటుంది. దానికి కావాల్సిన సామగ్రితో పాటు అన్ని కుల సంఘాల పెద్ద మనుషులకు ఆచారం ప్రకారం మర్యాదలు చేయాల్సి ఉంటుంది. కింది స్థాయి సిబ్బందికి మామూళ్లు, రావణ వధ ఉన్న చోట జీపీ ఆధ్వర్యంలో మరికొన్ని ఏర్పాట్లు చేయాలి. వీటి ఖర్చంతా దాదాపు రూ. లక్ష వరకు ఉంటుందని అంచనా.





కేవ్లా నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు తన్నీరు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు

మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్‌కు పరామర్శ

రాయపర్తి, అక్టోబరు 4 : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తండ్రి కేవ్లా నాయక్ కుటుంబాన్ని శుక్రవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దసరా.. దడ!

అధికారికంగా పండుగ

నిండుకున్న అధికారుల జేబులు

కార్యదర్శులకు పండుగ సంబరం కరువు

ప్రత్యేక నిధులు విడుదల చేయాలని విన్నపాలు

పట్టించుకోని ప్రభుత్వం.. ఉన్నతాధికారులు

రాయపర్తి, అక్టోబరు 4 : ఈ ఏడాది దసరా పండుగ అధికారులకు దడ పుట్టిస్తోంది. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన ఉండడంతో పండుగ ఏర్పాట్లు చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఎంగిలి పూల బతుకమ్మ పండుగ రోజే మైనర్ గ్రామ పంచాయతీల్లోనే దాదాపు రూ.30వేల వరకు గ్రామ పంచాయతీ కార్యదర్శుల జేబుల్లో నుంచి పెట్టుకోవాల్సి వచ్చింది. దసరా పండుగను ఆలోచిస్తే వారి గుండెల్లో దడపుడుతోంది. తెలంగాణ రాష్ట్ర అధికారిక పండుగగా బతుకమ్మ పండుగనుచేస్తున్నప్పటికీ, ఆ మేరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అధికారుల జేబుల్లోనుంచి డబ్బులు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే గ్రామ పంచాయతీల ఖజనాలు నిండుకోవడంతో, ప్రస్తుతం అధికారుల జేబులు కూడా నిండుకున్నాయని తమ గోడును పై అధికారుల వద్ద వెళ్లబోసుకుంటున్నారు.

జీపీలకు భారంగా పండుగ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలనుంచి రావాల్సిన నిధులు కొన్ని నెలలుగా రాకపోవడంతో ఇప్పటికే గ్రామ పంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు భారంగా మారింది. తొమ్మిది నెలలుగా నడుస్తున్న ప్రత్యేక పాలనతో ఇటు పంచాయతీల ప్రత్యేక అధికారులు, ఇటు కార్యదర్శుల సమన్వయంతోనే సొంత డబ్బులువెచ్చిస్తూ జీపీని వెళ్ల దీస్తున్నారు. కొన్ని నెలల నుంచి సెక్రటరీలు దాదాపు రూ.2లక్షల వరకు అప్పులు చేసి పంచాయతీలను నెట్టుకొస్తున్నారు. కానీ, దసరా పండుగ అంటేనే మన రాష్ట్ర ప్రజలకు పెద్ద పండుగ. దీనికి కావాల్సిన ఏర్పాట్లు సైతం అంతేస్థాయిలో చేయాల్సి ఉంటుంది. సద్దుల బతుకమ్మ ఏర్పాట్లతో పాటు దసరా రోజున నిర్వహించే పూజా తంతు ఖర్చులు భారీగానే ఉంటాయి. దీంతో ఈ ఏడాది పండుగ భారంగా మారిందనే చెప్పాలి.

తలలు పట్టుకుంటున్న సెక్రటరీలు

ప్రజా ప్రతినిధుల పాలనలో పంచాయతీలు ఉంటే ఏ సమస్య అధికారులకు ఉండేది కాదు. కానీ ఇప్పుడు వారు లేకపోవడంతో అధికారులకు ఖర్చు తప్పకపోవడంతో పాటు చిన్న సమస్య వచ్చిన చివాట్లు కూడా తప్పేలాలేవు. దీంతో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. ఓ పక్క నిధులు లేక ఇబ్బందులు, మరో పక్క గ్రామస్థాయిలో అధికారి, ప్రతిపక్ష పార్టీ నాయకుల బెదిరింపులు ఉంటాయని ఇప్పటినుంచే భయాందోళనకు గురవుతున్నారు. గ్రామపంచాయతీలకు నిధుల సమస్య లేకుండా ఉండి ఉంటే కాస్తా అందరినీ మెప్పించే వారే. కానీ ఇప్పుడు అప్పులు తెచ్చి పెట్టడం మూలంగా చేసే ఖర్చు కాస్తా ఆలోచించి పెట్టాల్సిన అవసరం ఉందని సెక్రటరీలు భావిస్తున్నారు.

నిర్వహణ భారం

సర్పంచుల పదవీ కాలం ముగిసిపోవడంతో ఏడు



రాయపర్తి ఎంపీడీవోకు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందిస్తున్న కార్యదర్శులు (ఫైల్)

నెలల నుంచి గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యతలు పూర్తిగా కార్యదర్శుల పైనే పడింది. గ్రామంలో ఏ పని చేయాలన్న డబ్బులు లేకపోతే అంతే పరిస్థితి. వస్తున్న పన్నులు కార్యాలయ నిర్వహణ, సిబ్బంది జీతాలకే చాలడంలేదు. దీంతో కొన్ని నెలలుగా సిబ్బంది జీతాలు సైతంలేక విలవిల లాడుతున్నారు. నీటి సరఫరా మొదలకుని, పారిశుధ్యం వీధి దీపాలు, చెత్త వాహనాల నిర్వహణ, ట్రాక్టర్ల ఈఎంఐలు ఇలా ఎన్నో ఇబ్బందులు పడుతూ పంచాయతీ పాలనను ముందుకు తీసుకెళ్తున్నారు. బోరు మోటార్లు బాగుచేయించడం, కల్వర్టులను శుభ్రం చేయించడం, పైపు లైన్ లీకేజీలు అరికట్టడం, చేతి పంపులు పాడైతే సరిచేయడం, నీటి ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్, గ్రామంలో తరచు ఏర్పడే సమస్యలని కార్యదర్శులే సొంత డబ్బులు పెట్టుకుని చేసుకోవాల్సి వస్తోంది. నిధులు జీపీలో లేకపోవడం మూలంగానే ఈ సమస్య ఉందని చెప్పకనే చెపుతున్నారు.

ఖర్చులు ఇలా...

వరంగల్ జిల్లాలో మొత్తం 13 మండలాలు ఉండగా, ఆయా మండలాల్లో 325 వరకు గ్రామాలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లోని కార్యదర్శులే పండుగ ఖర్చులను భరించుకోవాల్సి వస్తుంది. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ పండుగ సందర్భంగా ఆయా ప్రధాన ఆలయాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం, ఆలయం చుట్టూ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. మరుసటి రోజు వేసిన బతుకమ్మ పూలను ఎత్తిపోశారు. ఇక సద్దుల బతుకమ్మ పండుగ రోజున సైతం స్థానిక మైదానాల్లో, చెరువులు, కుంటల వద్ద విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలి. దారి పొడవున చీకటి లేకుండా విద్యుత్ స్తంభాలు లేకపోతే తాత్కాలికంగా కర్రలను నాటి లైట్లు బిగించాలి. మళ్లీ డీజేను ఏర్పాటు చేయాలి. డీజే ఖర్చు దాదాపు రూ.10 వేల వరకు ఉంటుంది. విజయదశమి పండుగ సందర్భంగా జమ్మి కొమ్మకు పూజ చేయడం తంతు ఉంటుంది. దానికి కావాల్సిన సామగ్రితో పాటు అన్ని కుల సంఘాల పెద్ద మనుషులకు ఆచారం ప్రకారం మర్యాదలు చేయాల్సి ఉంటుంది. కింది స్థాయి సిబ్బందికి మామూళ్లు, రావణ వధ ఉన్న చోట జీపీ ఆధ్వర్యంలో మరికొన్ని ఏర్పాట్లు చేయాలి. వీటి ఖర్చంతా దాదాపు రూ. లక్ష వరకు ఉంటుందని అంచనా.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తాం



ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్, పాలక మండలి

నెక్కొండ, అక్టోబరు 4 : ఆలయాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు భక్తులకు అన్ని రకాల సేవలను అందిస్తామని నెక్కొండ శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాల కమిటీల చైర్మన్‌లు కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, బెజ్జికి వెంకటేశ్వర్లు తెలిపారు. నూతనంగా ఆలయ కమిటీల చైర్మన్‌లు, పాలక మండలి చేత శుక్రవారం ఆలయ ధర్మకర్తల మండలి ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత ప్రమాణస్వీకారోత్సవం చేయించారు. నర్సంపేట శాసన సభ్యుడు దొంతి మాధవరెడ్డి సహకారంతో ఆలయాలను అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తామని చైర్మన్‌లు తెలిపారు. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తలుగా గుంటుపల్లి ప్రభాకర్‌రావు, కొత్తకొండ గణేష్, రాపాక అనిల్, కొంగర హైమావతి, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ధర్మకర్తలుగా సోమ సత్తిరెడ్డి, దేవనబోయిన వీరస్వామి, కక్కెర్ల శ్రీనివాస్, కొలకనూరి యాకలక్ష్మి , ఎక్స్ అఫీషియో మెంబర్‌లుగా టీవీఎస్ శాస్త్రి, బూర్గుపల్లి భవి శాస్త్రి బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, హరిప్రసాద్ , శ్రావణ్‌శాస్త్రి, కృష్ణమూర్తి, గోపాలకృష్ణ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

9న హైదరాబాద్‌లో టీపీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



నర్సంపేటలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీపీఎఫ్ నాయకులు

నర్సంపేట, అక్టోబరు 4 : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు జరుగనున్న టీపీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వేడుకలను విజయవంతం చేయాలని టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రాచమోని నాగభూషణం పిలుపు నిచ్చారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం సదస్సు కరపత్రాలను టీపీఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన, వనరుల రక్షణ కోసమం టీపీఎఫ్ ఆవిర్భవించిందన్నారు. టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల కనీస అవసరాలను గత పదేళ్ళు రాష్ట్రాన్ని పాలించిన పాలకులు కల్పించలేకపోయారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ అంబన్న, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనిల్. శేర్ల శ్రీనివాస్, కె.లక్ష్మయ్య, గిరగాని శ్రీనివాస్, జెత్‌రాంనాయక్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అండగా ప్రజా ప్రభుత్వం



ర్యాలీ నిర్వహిస్తున్న కళాకారులు

వర్ధన్నపేట, అక్టోబరు 4 : తెలంగాణ కళలకు ప్రాధాన్యం పెరగడంతో పాటు కళాకారుల్లో ఆత్మ విశ్వాసం పెరిగిందని కారుణశ్రీ ఈవెంట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం రాజశేఖర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో శుక్రవారం వర్ధన్నపేట పట్టణంలో జానపద మహోత్సవాలు 2024 ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలాలు వేసి ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపదం, నృత్యం, సంగీతం, బుర్రకథ, హరికథ, రంగస్థలం నాటలకాలతో పాటు అన్ని కళరూపాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ కళాకారులకు అండగా ఉండి ప్రభుత్వం ప్రోత్సహం అందిస్తుందని అన్నారు. ఈ ఉత్సవాల్లో శాస్త్రీయ, జానపద, ప్రాశ్చాత నృత్యాలు, ఒగ్గు, డోలు కోలాటం తదితర అంశాల్లో కళాకారులు ప్రదర్శించిన ప్రదర్శనలు ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాయి.

నేడు ధర్మారంలో జాబ్‌మేళా

గీసుగొండ, అక్టోబరు 4 : ధర్మారం ఎస్ఎస్ డిగ్రీ కళాశాల లో శనివారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మారుతి సొసైటీ ఇండస్ట్రీస్, శ్రీరాం ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఫీల్డ్ ఆఫీసర్స్‌గా పనిచేయడానికి టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివి 18-40 సంవత్సరాల ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99635 91463 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డీజే నిర్వాహకులకు సీఐ కౌన్సెలింగ్

గీసుగొండ, అక్టోబరు 4 : మండలంలోని డీజే నిర్వాహకులకు సీఐ బాబులాల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించి పలు సూచనలు చేశారు. పోలీసు నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్ష జరిమానాతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. డీజే సౌండ్స్ వల్ల వృద్ధులకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. డీజే నుంచి ఉత్పన్నమయ్యే అధిక డెసిబుల్స్ వల్ల పలు చోట్ల మృతి చెందిన సంఘటనలను ఉదహరించారు. కార్యక్రమంలో ఎస్ఐ కుమార్ పోలీస్‌లు పాల్గొన్నారు.

రేపు తెలంగాణ ఉద్యమకారుల సదస్సు



మాట్లాడుతున్న జేఏసీ మహిళా కన్వీనర్ అరుణ

నర్సంపేట, అక్టోబరు 4 : పట్టణంలోని సిటి జన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 6న జరిగే తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవం తం చేయాలని జేఏసీ మహిళా కన్వీనర్ గుడి పూడి అరుణ రాంచందర్ పిలుపు నిచ్చారు. పట్టణంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్యమకారు లకు 250 గజాల స్థలం, పక్కా గృహం మంజూరీ చేయడంతో పాటు ఉద్యమకారులకు, ఉద్యమంలో అమరులైన ఉద్యమకారుల కుటుంబాలకు రూ.25వేల వంతున పెన్షన్ అందించాలని, ఉచిత బస్సు, రైలు ప్రయాణ సౌకర్యం ఇతర సౌకర్యాలు కల్పించి ఉద్యమకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరాం ముఖ్యతిథిగా పాల్గొనే ఉద్యమకారుల సదస్సుకు మహిళా ఉద్యమకారులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కాసాని పద్మ, గాదె శైలజ, రామగిరి మాధవి, మాటేటి రజిత, ఆకారపు సరోజన, కొక్కు అరుణ, షక్ యాస్మిన్, పెద్దోజు అరుణ, మూలకుంట్ల లలిత. నూకల పద్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆస్పత్రులపై కఠినచర్యలు

డీఎంహెచ్‌వో వెంకటరమణ



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఎవో వెంకటరమణ

నర్సంపేట టౌన్, అక్టోబరు 4 : నిబంధనలను పాటించని ఆస్పత్రులపై కఠిన చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నా రు. పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సీపీఎన్‌డీటీ యాక్ట్, క్లినికల్ ఎస్టాబ్లి ష్‌మెంట్ యాక్ట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ గర్భ స్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు నడిపేవారు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాల ని, రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని, లేనిఎడల జరిమానా విధించి ఆస్పత్రులను సీజ్‌చేస్తామన్నా రు. ఆర్ఎంపీలు, పీఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోవద్దన్నారు. కేవలం ప్రథమ చికిత్సాలయం అని మాత్రమే బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విదేశాల్లో విద్యనభ్యసించిన వారు ఎఫ్ఎంజీఈ టెస్టులో ఉత్తీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాతనే ఆస్పత్రుల్లో వైద్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కిరణ్‌కుమార్, సూపరింటెం డెంట్ కిషన్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి

ఖానాపురం, అక్టోబరు 4 : వన్యప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నర్సంపేట రేంజ్ అధికారి రవికిరణ్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాకాలలో పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణులు, అడవుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అటవీ జంతువులను వేటాడితే చట్ట ప్రకారం శిక్షలుంటాయని అన్నారు. అడవులను సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అడవులను కాపాడితేనే మానవుల మనుగడ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో రీనా, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

ధనలక్ష్మి అలంకరణలో అమ్మవారు



నర్సంపేట టౌన్, అక్టోబరు 4 : నర్సంపేట పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం దుర్గామాత ధనలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. దుర్గామా తను వివిధ కరెన్సీ నోట్లతో అలంకరించారు. అనంతరం మహిళలచే సా మూహిక లలితపారాయణం, కుంకు మ పూజ, ధనలక్ష్మి పూజ, పల్లకి సేవ తో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అంచూరు కృష్ణమూర్తి, నాగమల్ల కృష్ణమూర్తి, పిన్నా రామనాథం, పబ్బ శివ, మదనపల్లి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

- చెన్నారావుపేట: మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామంలోని మాధవనగర్ కాలనీలో దేవి శరన్నరాత్రి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దుర్గాదేవి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో రూపిక శ్రవణ్‌కుమార్, వినయ్; భాస్కర్, మంచాల శ్రీరామ్, ప్రసన్న కుమార్, హరినాథ్, వాసు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాల ఆలయ హుండీ లెక్కింపు

గీసుగొండ, అక్టోబరు 4: కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీల లెక్కింపును శుక్రవారం నిర్వహించారు. హుండీల ఆదాయం రూ.1,60,532 వచ్చినట్లు ఆలయ ఈవో శేషగిరి తెలిపారు. ప్రతీ సంవత్సరం మూడుసార్లు హుండీల లెక్కింపు ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రథోత్సవం అయిన తరువాత ఒక సారి, శ్రీరామనవమి తరువాత రెండోసారి, అక్టోబర్‌లో 3వ సారి హుండీల లెక్కింపు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ డివిజన్ పరిశీలకులు అనిల్ కుమార్, ఈవో శేషగిరి, ఫౌండర్ చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డి కోలుకోవాలని పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

రాయపర్తి, అక్టోబరు 4 : పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి ఓ ఫంక్షన్ కార్యక్రమంలో జరిగిన ప్రమాదంలో గాయపడగా ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్యం బాగుండాలని, త్వరగా కోలుకొని ప్రజా క్షేత్రంలోకి రావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో మండలంలోని వెంకటేశ్వరపెల్లి గ్రామంలో గల సన్నూరు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే పరిశీలన



ఎంపీడీవో నుంచి సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

దుగ్గొండి, అక్టోబరు 4 : మండలంలోని మదిరలో నిర్వహిస్తున్న కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను శుక్రవారం ఆర్డీవో కృష్ణవేణి సందర్శించి పరిశీలన చేశారు. కుటుంబ వివరాలను జాబితాల వారీగా తయారు చేయాలని ఎంపీడీవో అరుంధతిని ఆదేశించారు. పెండ్లి అయిన వారిని ప్రత్యేక కాలంలో నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీవో మోడెం శ్రీధర్‌గౌడ్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా

- తప్పిన ప్రమాదం

చెన్నారావుపేట, అక్టోబరు 4 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన మండలంలోని గొల్లపల్లె గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన గొస్కుల ప్రభాకర్ తన ట్రాక్టర్‌ను తోలుకుంటూ నర్సంపేటకు వెళ్లి, తిరిగి గ్రామానికి చెరువు కట్టపై నుంచి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదవశాత్తు చెరువు కట్టపై నుంచి పొలాల్లో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరుగ లేదు. దీంతో అక్కడ ఉన్న గ్రామస్థులు ఉపిరి పీల్చుకున్నారు.

చెప్పేవి నీతి సూత్రాలు.. చేసేవి అక్రమ వసూళ్లు..

(5వ పేజీ తరువాయి)

వసూలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. సదరు ఇళ్లు నిషేధిత స్థలంలో ఉందా? నిర్మాణ అనుమతులు ఉన్నాయా? లేవా? అని చూడకుండా చేతులు తడుపగానే గుడ్డిగా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు సమాచారం.

కాగా, విలీన గ్రామాల్లో చాలా ఇండ్లు నిషేధిత స్థలాల్లో ఉన్నప్పటికీ పంచాయతీ నుంచి నంబరు పొందారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిషేధిత స్థలాల్లో ఉన్న ఇండ్లను కూల్చుతున్న విషయం తెలిసిందే. డబ్బులు తీసుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ అనుమతులు లేని ఇండ్లు, పార్ట్ రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నట్లు సమాచారం. నిబంధనలు విస్మరించేది లేదంటూనే శాఖ ఆదాయం తగ్గిస్తున్న సబ్ రిజిస్ట్రార్.. తన ఖజానా మాత్రం నింపుకుంటున్నట్లు సమాచారం. కాగా ఈయన దండుకుంటున్న మొత్తం నుంచి అదే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తోటి అధికారికి వాటా ఇస్తున్నట్లు తెలిసింది. తోటి అధికారి సహకారంతో సబ్ రిజిస్ట్రార్ అక్రమ రిజిస్ట్రేషన్‌లకు తెరలేపినట్లు సమాచారం. సోమవారం బాధ్యతలు చేపట్టిన జిల్లా రిజిస్ట్రార్ ఈ దందాపై ఏ మేరకు స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

గుడుంబా పట్టివేత

చెన్నారావుపేట, అక్టోబరు 4 : మండలంలోని అక్కల్‌చెడ గ్రామ శివారు లచ్చినాయక్ తండాలో అక్రమంగా ఓ ఇంట్లో గుడుంబా తయారు చేసి విక్రయిస్తుండగా శుక్రవారం సాయంత్రం పట్టుకున్నట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి తండాకు చెందిన బద్రు అనే వ్యక్తి తన ఇంట్లో గుడుంబాను తయారు చేసి విక్రయాలు చేస్తున్నాడు. పోలీసులకు సమాచారం రావడంతో బద్రు ఇంట్లో దాడులు నిర్వహించి 10లీటర్ల గుడుంబా, 80 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి

వరంగల్ కలెక్టరేట్, అక్టోబరు 4 : నర్సంపేటలో నూతనంగా ప్రారంభించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న స్వీపర్, అటెండర్, టెక్నీషియన్, ఏఎన్ఎం, జీఎన్ఎం, సూపర్ వైజర్ తదితర పోస్టుల్లో అర్హులైన దళిత కుటుంబాలకు అవకాశం కల్పించాలని కోరారు. కొంత మంది దళారులు ఏజెన్సీ ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేశారని, ఉద్యోగం వస్తుందనే ఆశతో కొందరు అమాయకులు మోసపోయారని తెలిపారు. స్థానికులకే అవకాశం కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.

నర్సంపేటలో కాసం ఫ్యాషన్స్ ప్రారంభం

నర్సంపేట, అక్టోబరు 4:పట్టణంలో కాసం ఫ్యాషన్స్ 14వ స్టోర్‌ను సినీనటి, యాంకర్ అనసూయ భర ద్వాజ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధునాతన కలెక్షన్స్‌తో నిత్యనూతన వెరైటీలతో కాసం ఫ్యాషన్స్ పేరుగాంచిందన్నారు. ఈ స్టోర్‌ను నర్సంపేటలో తాను ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా మాల్‌లోని లేడీస్, జెంట్స్, కిడ్స్ వెర్ కలియ తిరిగి సందడిచేశారు. ఈ ప్రాంతవాసులు దసరా షాపింగ్‌ను కాసం ఫ్యాషన్స్‌లో చేయాలని అన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శి వాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగురాష్ట్రాల్లో 4ఏళ్లుగా ప్రజల మన్న నలు పొందుతూ ఇప్పటి వరకు తెలంగాణ, ఆంధ్రప్ర దేశ్‌లో 14వ స్టోర్‌ను ప్రారంభించామని అన్నారు. ఈ వారంలో వనపర్తిలో కూడా స్టోర్‌ను విస్తరించబోతున్నామని చెప్పారు. మా వస్త్రాలను ఎల్లప్పుడు ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలని పేర్కొన్నారు. అధునాతన ఫ్యాషన్ డిజైన్లను వినియోగదారులకు తక్కువ రేటుకే అందిస్తున్నామని తెలిపారు. తొలుత అందాల తార సినీనటి, యాంకర్ అనసూయను చూడడానికి ఉదయం నుంచి అభిమానులు, పరిసర ప్రాంత యువతీ, యువకులు బారులు తీరారు. యువతీ, యువకుల కేరిం తలతో షాపింగ్ మాల్ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. తన ఆటపాట లతో సందడిచేసి అభిమానులను అనసూయ అలరింపజే శారు. కార్యక్రమంలో కాసం ఫణి, కాసం సాయికృష్ణ, కాసం దీరజ్, డాక్టర్ కాసం ప్రీతం, యాంసాని ప్రవీణ్ ఫుల్లూరు అరుణ్‌కుమార్, వరుణ్, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



కాసం ఫ్యాషన్స్ ప్రారంభం సందర్భంగా జ్యోతిప్రజ్వలన చేస్తున్న సినీనటి అనసూయభరద్వాజ్